క్లుప్తంగా

నేడు అనంత పద్మనాభుని కల్యాణం

కపిలేశ్వరపురం: అంగరలోని అనంత పద్మనాభ స్వామి కల్యాణాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. స్వామి ఆలయంలో కల్యాణ పూజలతో పాటు రామనామ సంకీర్తన, గీతా పారాయణ నిర్వహిస్తామన్నారు.

చిన్నకోరుమిల్లిలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ



చిన్న కోరుమిల్లిలో ఆంజనేయస్వామి విగ్రహ శిల్పిని సత్కరిస్తున్న ఎమ్మెల్సీ తోట

కపిలేశ్వరపురం: మండలంలోని చిన కోరుమిల్లిలో ఏర్పాటు చేసిన 45 అడుగుల భారీ అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ పూజలు గురువారం వైభవంగా సాగాయి. గ్రామ ప్రజల సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ విగ్రహ ప్రతిష్ఠ వేద పండితుల మంత్రోచ్ఛరణలు, భక్తుల పూజల మధ్య సందడిగా సాగింది. ఈ నెల 22 నుంచి ఐదు రోజుల పాటు ప్రతిష్ఠ పూజలు కొనసాగాయి. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తదితర ప్రజాప్రతినిధులు స్వామిని దర్శించుకున్నారు. భారీ అన్నదానం నిర్వహించారు. అంగరకు చెందిన విగ్రహ శిల్పి పెద్దింశెట్టి వెంకటేశ్వరరావును సత్కరించారు.

సచివాలయాల మండల కన్వీనర్‌గా శ్రీనివాస్



కె.గంగవరం: సచివాలయ మండల కన్వీనర్‌గా తామరపల్లికి చెందిన తోకల శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన నియోజకవర్గ వైఎస్సార్ సీపీ పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందుకున్నారు.


నేడు వెంటూరులో గడప గడపకూ..

రాయవరం: మండలంలోని వెంటూరులో శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తారని ఎంపీడీవో డి.శ్రీనివాసు గురువారం విలేకరులకు తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాజులూరు: గొల్లపాలెం 333/11 కేవీ విద్యుత్ స్టేషన్ పరిధిలోని కాజులూరు, కరప, తాళ్లరేవు మండలాల్లోని పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ కాకినాడ డీఈ జి.ప్రసాద్ తెలిపారు. సబ్‌స్టేషన్, విద్యుత్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. గొల్లపాలెం సబ్‌స్టేషన్ పరిధిలోని, గొల్లపాలెం, ఆర్యావటం, శలపాక, తణుకువాడ, డేగలపేట, మొగలిపాలెం, శీల, మంజేరు, చేదువాడ, బందనపూడి, మతుకుమిల్లి, తర్లంపూడి, జగన్నాథగిరి, పెనుమళ్ళ, అంద్రంగి, పెదపాటిగరువు గ్రామాలకు, కరప మండలంలోని గొర్రిపూడి, కొంగోడు, పెద్దాపురప్పాడు, విజయరాయుడుపాలెం గ్రామాలకు, కాజులూరు సబ్‌స్టేషన్ పరిధిలోని కాజులూరు, తిప్పరాజుపాలెం, అయితపూడి తదితర గ్రామాలకు, తాళ్ళరేవు మండలం ఇంజరం సబ్‌స్టేషన్ పరిధిలోని కోలంక, నామవానిపాలెం, చలివేంద్రపాడు, పోలమూరుపాడు, తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. వినియోగదారుల సహకరించాలని డీఈ కోరారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక అక్షరాభ్యాసం



చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహిస్తున్న తల్లిదండ్రులు

మండపేట: వసంత పంచమి సందర్భంగా పట్టణంలోని వాణీ విద్యావిహార్ స్కూల్లో గురువారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. తల్లిదండ్రులు తమ చిన్నారులతో సరస్వతీ పూజ చేయించి అక్షరాలు దిద్దించారు. ఈ సందర్భంగా ఎస్టేట్ ఇన్‌చార్జి దాసరి వెంకటరమణమూర్తి మాట్లాడుతూ వాణీ విద్యావిహార్ ఎందరో విద్యార్థుల ఉన్నతికి బాటలు వేసిందన్నారు. కొన్ని కారణాలతో గతంలో నిర్వహణ నిలిపివేయగా భారతీయ విద్యా కేంద్రం ఆధ్వర్యంలో పాఠశాలను పునః ప్రారంభించామన్నారు. స్కూల్ కమిటీ సభ్యులు వల్లూరి విజయానంద పార్థ సారథి, అడపా రామారావు, ముత్యాల చక్రవర్తి, ఎంపీఎస్ విద్యాసంస్థల అధినేత వల్లూరి చిన్నారావు, మేడవరపు నరసింహం, నల్లానుచక్రవర్తుల రామానుజం తదితరులు పాల్గొన్నారు.

అత్యున్నత ప్రజాస్వామ్య దేశం మనది

- రాజ్యసభ ఎంపీ సుభాష్‌చంద్రబోస్
- ఘనంగా గణతంత్ర వేడుకలు

రామచంద్రపురం: విభిన్న వర్గాలు, భాషలు గలిగిన మన దేశంలో అందరికీ సమానత్వం, సౌభ్రాతృత్వాలను అందిస్తూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నేతృత్వంలో రాజ్యాంగాన్ని రచించి ప్రపంచంలోనే అత్యున్నత ప్రజాస్వామ్య దేశంగా మన దేశాన్ని తీర్చిదిద్దారని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ అన్నారు. పట్టణంలోని చైతన్య పాఠశాలలో జరిగిన గణతంత్ర వేడుకల్లో ఎంపీ బోస్ ముఖ్యతిథిగా పాల్గొని జాతీయ జెండా ఎగరవేశారు. ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగ స్ఫూర్తిని విద్యార్థులకు వివరించారు. పాఠశాల యాజమాన్యం, సిబ్బంది, వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు. వివిధ వేషధారణలు ముస్తాబైన విద్యార్థులను ఎంపీ బోస్ అభినందించారు. నియోజకవర్గంలో గణతంత్ర వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లో మహాత్మాగాంధీ, బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించి, జాతీయ జెండా ఆవిష్కరించి స్వీట్లు పంచారు.

ఆర్డీవో కార్యాలయంలో..

పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో పి.సింధు సుబ్రహ్మణ్యం జాతీయ జెండాను ఎగరవేశారు. తొలుత మహాత్మాగాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్వీట్లు పంచి గణతంత్ర శుభాకాంక్షలు తెలియజేశారు. వీఆర్వోలు, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక కోర్టుల ప్రాంగణంలో సీనియర్ సివిల్ జడ్జి మాధవీలత, మున్సిపల్ కార్యాలయం వద్ద కమిషనర్ టి.శ్రీకాంత్‌రెడ్డి, చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, పోలీస్‌స్టేషన్ వద్ద ఎస్సై డి.సురేష్‌కుమార్, స్థానిక ఏరియా ఆసుపత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ వీరభద్రుడు జెండాలను ఎగరవేసి గణతంత్ర దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం కరోనా సమయంలో ఏరియా ఆసుపత్రిలో ఉత్తమ సేవలను అందించిన పారిశుద్ధ్య కార్మికులు, నర్సులు, వైద్యులు ఇతర సిబ్బంది సేవలను కొనియాడుతూ ప్రశంసా పత్రాలను అందజేశారు.

అబ్దుల్ కలాం సేవా సంస్థ నేతృత్వంలో..

పట్టణంలోని బ్రాడీపేటలో అబ్దుల్ కలాం సేవా సంస్థ నేతత్వంలో సంస్థ అధ్యక్షుడు బాబ్జి జాతీయ జెండాను ఆవిష్కరించి స్వీట్లు పంచారు. పట్టణంలోని జనసేన, టీడీపీ, బీజేపీ కార్యాలయాల వద్ద ఆయా పార్టీల నేతలు జాతీయజెండాను ఎగురవేసి అనంతరం స్వీట్లు పంచారు.

మువ్వన్నెల జెండా రెపరెపలు

రామచంద్రపురం రూరల్: మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ సచివాలయాలు, విద్యా సంస్థల్లో గురువారం గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. జాతీయ నాయకుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఎంపీపీ కార్యాలయంలో ఎంపీడీఓ ఎన్.కీర్తిస్పందన జాతీయ జెండా ఎగరవేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, జడ్పీ కోఆప్షన్ మెంబర్ తాతపూడి ప్రసన్న విజయకుమార్, ఎంపీపీ అంబటి భవాని, వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, ఎంఈఓ మానుపూడి శ్రీనివాస్, ఈఓపీఆర్డీ ఎన్.షెలత్ రాజు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ పి.తేజేశ్వరరావు, ద్రాక్షారామ పోలీస్‌స్టేషన్ వద్ద ఎస్సై బి.వినోద్‌లు జెండా ఎగరవేశారు. మండలంలోని సర్పంచ్‌లు గ్రామ సచివాలయాల వద్ద జెండా వందనం చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఆయా ప్రధానోపాధ్యాయులు, విద్యార్థుల సమక్షంలో జెండా వందనం చేశారు.

మోడరన్ ఆధ్వర్యంలో తిరంగా యాత్ర

రామచంద్రపురం: రిపబ్లిక్ డే పురస్కరించుకుని పట్టణంలోని మోడరన్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో తిరంగా యాత్ర నిర్వహించారు. మోడరన్ విద్యాసంస్థలకు చెందిన ఆరు విభాగాల అధ్యాపకులతో 250 జాతీయ జెండాతో మూడు జిల్లాల సరిహద్దు గ్రామాల మీదుగా తిరంగాయాత్ర చేశారు. రామచంద్రపురం మండలం నరసాపురపుపేట నుంచి తూర్పుగోదావరి జిల్లా మెళ్లూరు జంక్షన్ నుంచి కాకినాడ జిల్లా వేంద్ర గ్రామంలోని హనుమాన్ జంక్షన్ వరకు ఈ యాత్ర చేశారు. మోడరన్ విద్యా సంస్థల అధినేత జీవీ రావు మాట్లాడుతూ దేశాభివృద్ధిని కాంక్షిస్తూ ఈ యాత్ర చేపట్టినట్లు చెప్పారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు చాట్రాది వీరలక్ష్మి, మెళ్లూరు సర్పంచ్ పెద్దిరెడ్డి సత్యసాయిరామ్, వేంద్ర సర్పంచ్ కోసూరు వాసు, మోడరన్ సిబ్బంది పాల్గొన్నారు.

కాజులూరులో..

కాజులూరు: మండలంలో గణతంత్ర దినోత్సవాన్ని ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. ప్రభుత్వ, ప్రభుత్వేతర కార్యాలయాల్లోనూ, పంచాయతీ కార్యాలయాల్లోనూ, పాఠశాలల్లో జాతీయ జెండాలను ఆవిష్కరించి, చిన్నారులకు, ప్రజలకు స్వీట్లు పంచారు. ఎంపీపీ కార్యాలయంలో ఎంపీడీవో ఇందిరాదేవి జాతీయజెండా ఆవిష్కరించారు. గొల్లపాలెం జెడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎం వెంకటలక్ష్మి, తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ బి.సాయిసత్యనారాయణ, గొల్లపాలెం పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్సై నెల్లి బాలరాజు మువ్వన్నెల జెండాను ఎగురవేశారు. గొల్లపాలెంలో ఎన్‌సీసీ క్యాడెట్లు చేసిన కవాతులు, పలు విన్యాసాలు రిపబ్లిక్ డే కార్యక్రమాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పోతురాజు బాబూరావు, గొల్లపాలెం ఉప సర్పంచ్ తాడి భువనేశ్వరి, ఎంపీటీసీ సభ్యురాలు జొన్నకూటి పద్మాజ, మంజేరు పీఏసీఎస్ చైర్మన్ గండి కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

కె.గంగవరంలో..

కె.గంగవరం: మండలంలోని అన్ని గ్రామాల్లో గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని సచివాయాలు, ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద పంచాయతీ కార్యదర్శులు, హెచ్‌ఎంలు ఆధ్వర్యంలో మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. ఈ సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఆయా గ్రామ పెద్దలు ప్రధానోపాధ్యాయులు బహుమతులు అందించారు. అనంతరం స్వీట్లు పంచుకుని వేడుక చేసుకున్నారు. ఎంపీపీ ఎంపీడీఓ ఎన్.శ్రీనివాస్ జెండా ఆవిష్కరణ చేశారు. ఎంపీపీ పంపన నాగమణి, ఎంపీటీసీలు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ వైద్యనాథశర్మ జెండా ఎగురవేశారు.

మండపేట నియోజకవర్గంలో..

మండపేట: భారత గణతంత్ర దినోత్సవ వేడుకలను గురువారం మండపేటలో వీధివీధినా ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల వద్ద అధికారులు, నాయకులు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జెండా వందనం చేశారు. మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహించిన వేడుకలకు చైర్ పర్సన్ పతివాడ దుర్గారాణి, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాజుబాబు తదితరులు హాజరయ్యారు. కమిషనర్ టి.రామ్ కుమార్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ రాజేశ్వరరావు, మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీఓ రాజు జాతీయ జెండాను ఆవిష్కరించి జెండా వందనం చేశారు. పట్టణంలోని గొల్లపుంత కాలనీలో మున్సిపల్ యూపీ స్కూల్ వద్ద నిర్వహించిన వేడుకలకు మున్సిపల్ చైర్‌పర్సన్ దుర్గారాణి ముఖ్య అతిథిగా హాజరై జెండాను ఆవిష్కరించారు. మండలంలోని అర్తమూరు పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన వేడుకల్లో సర్పంచ్ గొలుగూరి అన్నపూర్ణ, ఏడిదలో సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, ద్వారపూడిలో సర్పంచ్ ఈతకోట కిన్నెర, మెర్నిపాడులో సర్పంచ్ గారపాటి సౌజన్య, పాలతోడులో సర్పంచ్ పిల్లా వెంకటలక్ష్మి, మారేడుబాకలో సర్పంచ్ మట్టపర్తి గోవిందరాజులు, ఏడిద సీతానగరంలో ఉప సర్పంచ్ వరదా చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: దేశ స్వాతంత్ర్య ఫలాలు ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేయాలని గణతంత్ర దినోత్సవంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు అన్నారు. కపిలేశ్వరపురంలో నిర్వహించిన వేడుకల్లో జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. మండలంలోని 19 పంచాయతీల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, విద్యాలయాలు, అంగర పోలీస్ స్టేషన్ల వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించి స్వాతంత్ర్య సాధన లక్ష్యాన్ని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రతిభా పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

రాయవరం: దేశభక్తులు, మహనీయుల త్యాగాలను మరవద్దని రాయవరం ఎంపీపీ నౌడు వెంకటరమణ అన్నారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీడీవో డి.శ్రీనివాసు పతాకావిష్కరణ చేయగా, ఎంపీపీ వెంకటరమణ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఐసీడీఎస్ పీవో వరహాలక్ష్మి, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. పసలపూడి జెడ్పీహైస్కూల్లో హెచ్‌ఎం ఎం.అంబేడ్కర్ ఆధ్వర్యంలో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో పారిశ్రామికవేత్త చైతన్య రాజబాబు రూ.10 వేలు, హెచ్‌ఎం అంబేడ్కర్ రూ.4 వేలు పాఠశాలకు పరేడ్ డ్రిల్‌కు విరాళంగా అందజేశారు. సర్పంచ్ కడలి పద్మావతి, పీఎంసీ చైర్మన్ కొవ్వూరి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ మాజీ చిన్నం అపర్ణాపుల్లేష్ తదితరులు పాల్గొన్నారు. వివిధ పంచాయతీ కార్యాలయాల వద్ద కార్యదర్శులు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.



మండపేట మున్సిపల్ కార్యాలయం వద్ద వేడుకల్లో చైర్ పర్సన్ దుర్గారాణి, రాజుబాబు, కమిషనర్ రామ్‌కుమార్ తదితరులు



రామచంద్రపురంలో జెండా ఎగురవేస్తున్న రాజ్యసభ ఎంపీ సుభాష్‌చంద్రబోస్



250 అడుగుల జాతీయ జెండాతో తిరంగా యాత్ర చేస్తున్న మోడరన్ సిబ్బంది



గొల్లపాలెంలో జాతీయజెండాకు వందనం చేస్తున్న హెచ్‌ఎం వెంకటలక్ష్మి తదితరులు



పామర్రు ఉన్నత పాఠశాల వద్ద జెండా ఎగురవేస్తున్న హెచ్‌ఎం శ్రీనివాస్



కపిలేశ్వరపురంలో జాతీయ నాయకులకు నివాళి అర్పిస్తున్న ఎంపీడీఓ, జెడ్పీటీసీ, ఎంపీపీ



రాయవరంలో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ వెంకటరమణ తదితరులు

'పీఎంశ్రీ'కి తాపేశ్వరం జెడ్పీ హైస్కూల్

పాఠశాలలో ఘనంగా వేడుకలు

మండపేట: రామచంద్రపురం డివిజన్ నుంచి సీబీఎస్ఈ సిలబస్‌కు ఎంపికైన ఏకైక పాఠశాలగా గుర్తింపు పొందిన తాపేశ్వరంలోని పోలిశెట్టి సత్తిరాజు భూషణం జెడ్పీ ఉన్నత పాఠశాల మరో ఘనత దక్కించుకుంది. ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ) ఎంపికైంది. గురువారం పాఠశాలలో నిర్వహించిన మీడియా సమావేశంలో పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్, సురుచి ఫుడ్స్ అధినేత పోలిశెట్టి మల్లిబాబు ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులు ఉన్నత ప్రమాణాలు అందుకునేందుకు ఈ పథకం దోహద పడుతుందన్నారు. హెచ్‌ఎం గుణ్ణం వీరన్న మాట్లాడుతూ పీఎంశ్రీ ద్వారా ఐదేళ్ల పాటు రూ.70 లక్షలు వెచ్చించి 21వ శతాబ్దపు ప్రమాణాలకు అనుకూలంగా పాఠశాలను ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందన్నారు. అనంతరం మల్లిబాబు ఆధ్వర్యంలో హెచ్‌ఎం వీరన్న, ఉపాధ్యాయులు ఎం.నాగేంద్ర కుమార్, బి.సాయిరాం తదితరులను ఘనంగా సత్కరించారు.



పీఎంశ్రీకి ఎంపిక కావడంపై హర్షం వ్యక్తం చేస్తున్న మల్లిబాబు, ఉపాధ్యాయులు

విద్యాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

కె.గంగవరం: విద్యాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని ఎంపిపి పంపన నాగమణి, జెడ్పీటీసీ ఓబులనేని శ్రీవరలక్ష్మి అన్నారు. మండలంలోని కె.గంగవరం, దంగేరు ఉన్నత పాఠశాలల్లో గురువారం పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు సీవీవీ సత్యనారాయణ, వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఇప్పటికే నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయని దీంతో పాటు అమ్మఒడి, విద్యా దీవెన పథకాలను పక్కాగా అమలు చేస్తుందన్నారు. నాణ్యమైన పౌష్టికాహారం అందించడంతో పాటు మెరుగైన విద్యను అందిస్తుందన్నారు. ఇప్పటికే పదోతరగతి విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్‌ను అందిస్తుందని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని చదువులో రాణించాలని కోరారు. ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు ఓబులనేని రాజ్‌కుమార్, కోటి వెంకట్రావు, పంపన సుబ్బారావు, సర్పంచ్ కొప్పిశెట్టి రమణ, ఎంపీటీసీ కొప్పిశెట్టి లక్ష్మణ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



కె.గంగవరంలో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ తదితరులు

స్టడీ మెటీరియల్ పంపిణీ

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్‌లో గురువారం జెడ్పీ నిధుల నుంచి అందజేసిన పదో తరగతి స్టడీ మెటీరియల్‌ను ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని పీఎస్‌బీఎస్‌కే సుందరి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, గ్రామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ, ఉప సర్పంచ్ పెన్నాడ బుచ్చిరాజు, వార్డు సభ్యులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

గోదావరిలో దూకి యువకుడి మృతి

కె.గంగవరం: మండలంలోని సత్యవాడ శివారు ఈస్టుకండ్రికకు చెందిన పల్నాటి రాంబాబు (28) గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాంబాబు బుధవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. అయితే గురువారం ఉదయం సుందరపల్లి వద్ద గోదావరిలో శవమై తేలడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. గోదావరి ఏటిగట్టు వద్ద రాంబాబుకు చెందిన బైక్, సెల్‌ఫోన్ గోదావరి గట్టున దొరకడంతో వారి కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారం అందించారు. రాంబాబు మేనమామ అడపా శ్రీనివాసు ఫిర్యాదుతో కె.గంగవరం ఎస్సై కె.చిరంజీవి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

రామచంద్రపురం: ఫేస్ షీల్డ్ అటెండన్స్ సర్వర్ సరిగ్గా నమోదు చేయలేకపోవటం వల్ల నిరక్షరాస్యులైన కార్మికులు దాన్ని తిరిగి సరిచేయడానికి ఇబ్బందులు పడుతున్నారని కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకులు పెద్దిరెడ్డి రాము అన్నారు. మున్సిపల్ వర్కర్స్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కార్మికుల సమస్యలపై గురువారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏఐటీయూసీ నేతృత్వంలో కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. నిరక్షరాస్యులైన కార్మికులకు ఫేస్ షీల్డ్ అటెండెన్స్ తొలగించాలని ఏఐటీయూసీ నేతలు డిమాండ్ చేశారు. మున్సిపల్ వర్కర్స్ నాయకులు బి.సత్యనారాయణ, జి.రాజు, ఎ.మాచర్లరావు, ఎస్.సుధా, ముత్యాల సుజాత, ప్రజా నాట్యమండలి నాయకులు ఎం.ప్రేమానందం, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు ఉత్తమ సేవా పురస్కారాలు



కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎంపీ చింతా అనురాధల చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న పామర్రు పీహెచ్‌సీ వైద్యుడు మాణిక్యం, పురస్కారం అందుకుంటున్న కార్యదర్శి చంటి, పురస్కారం అందుకుంటున్న వెలుగు ఏపీఓ గణపతి, ద్రాక్షారామ భీమేశ్వరాలయ ఈఓ తారకేశ్వరరావు, రామచంద్రపురం మండల తహసిల్దార్ తేజేశ్వరరావు, జిల్లా సైన్స్ అధికారి గిరజాల వెంకట సత్య సుబ్రహ్మణ్యం , ఏఈ రమణ, మున్సిపాలిటీ అధికారులు సిబ్బంది, ఏడిద సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, యానిమేటర్ శ్రీదేవి

రామచంద్రపురం రూరల్/రామచంద్రపురం/కె.గంగవరం/రాయవరం/మండపేట: భారత గణతంత్ర దినోత్సవం పురస్కరించుకుని పలువురిని ఉత్తమ సేవా పురస్కారాలు వరించాయి. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎంపీ చింతా అనురాధల చేతుల మీదుగా అవార్డులను అందుకున్నారు. ద్రాక్షారామ భీమేశ్వరస్వామి దేవస్థానం ఈఓ పీటీవీవీ సత్యనారాయణమూర్తి(తారకేశ్వరరావు), రామచంద్రపురం మండల తహసీల్దార్ పి.తేజేశ్వరరావు, ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయుడు గిరజాల వెంకట సత్య సుబ్రహ్మణ్యం, ఏడీఏ ఎస్.జయరామలక్ష్మి, జాతీయ ఉపాధిహామీ పథకం ఏపీడీ సత్యనారాయణ, ఏపీఓ జి.అరుణకుమారి, ద్రాక్షారామ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ జి.సుధాకరప్రసాద్, మునిసిపాలిటీ డీఈ డి.దుర్గాప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎస్.డేవిడ్‌రాజు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కె.సూరారావు, జూనియర్ అకౌంటెంట్స్ ఎం.సత్యనారాయణమూర్తి, మెప్మా సీవో ఎస్.మహాలక్ష్మి, డీఈఓ రామోజీరావు, సచివాలయ సిబ్బంది ఎమినిటీ సెక్రటరీ షేక్ ఇజాజ్, అహ్మద్‌జానీ, టౌన్ ప్లానింగ్ సెక్రటరీ కె.సాయిరాంమాలిక్, పారిశుద్ధ్య సిబ్బంది సీహెచ్ పాల్‌రాజు, బెండియమ్మ, అలాగే పట్టణ ఏపీఈపీడీసీఎల్ ఏఈ ఎం.రమణ, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వీరభద్రునికి కూడా విశిష్ట సేవా పురస్కారం దక్కింది. కె.గంగవరానికి చెందిన ఈఓపీఆర్డీ నరేంద్ర, వెలుగు ఏపీఓ కాదా లక్ష్మీగణపతి, పంచాయతీ కార్యదర్శి ముద్రగడ చంటి, పామర్రు పీహెచ్‌సీ వైద్యుడు మాణిక్యం, కె.గంగవరంలోని ఆర్‌బీకే వ్యవసాయ సహాయకులు మంజు ప్రవల్లిక ప్రశంసాపత్రాలు అందుకున్నారు. అలాగే మండలపేట మండలంలోని వెదురుపాకకు చెందిన వైఎస్సార్ క్రాంతి పథం యానిమేటర్ శ్రీదేవి, ఏడిద సర్పంచ్ బూరిగ ఆశీర్వాదంకు ఉత్తమ సర్పంచ్ అవార్డు లభించింది.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు శ్రీకారం



అర్తమూరులో రాట ముహూర్తం చేస్తున్న సర్పంచ్ అన్నపూర్ణ, బులిస్వామిరెడ్డి తదితరులు



మహా రుద్రయాగ పనులకు రాట ముహూర్తం చేస్తున్న కమిటీ సభ్యులు

ఫిబ్రవరి 21 నుంచి 15వ వార్షిక బ్రహ్మోత్సవాలు

మండపేట: అర్తమూరులోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామివారి 15వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 21 నుంచి ప్రారంభం కానున్నాయి. వారం రోజుల పాటు జరగనున్న ఈ ఉత్సవాలకు సర్పంచ్ గొలుగూరి అన్నపూర్ణ, విజయభాస్కరరెడ్డి దంపతులు, శ్రీవారి భక్తమండలి చైర్మన్ సత్తి బులిస్వామిరెడ్డి గురువారం రాట ముహూర్తం చేశారు.అనంతరం బులిస్వామిరెడ్డి మాట్లాడుతూ ఉత్సవాల కోసం చలువ పందిళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. 21వ తేదీ 28వ తేదీ వరకు శ్రీవారి బ్రహ్మోత్సవాలు జరుగుతాయన్నారు. మాలధారులకు రోజు భిక్ష, అల్పాహారం ఏర్పాటు చేస్తామని తెలిపారు. భక్త మండలి కన్వీనర్ కర్రి బాపిరెడ్డి, కొవ్వూరి గంగిరెడ్డి, వెంకటరెడ్డి, శివారెడ్డి, ఉద్దగిరి ఆంజనేయులు, సుబ్బారెడ్డి, పంపన సుబ్బారావు, తాడి రామారెడ్డి, కాయల సత్తిరెడ్డి, మనీషా తదితరులు పాల్గొన్నారు.

మహా రుద్ర యాగానికి రాట ముహూర్తం

రాయవరం: సోమేశ్వరంలోని బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో వచ్చే నెల 12 నుంచి 23 వరకూ నిర్వహించే మహా రుద్ర యాగానికి ఆలయంలో గురువారం రాట ముహూర్తం చేశారు. విశ్వశాంతి లోక కల్యాణార్థం పంచాయతన మహా రుద్రయాగాన్ని ఈ ఆలయంలో నిర్వహిస్తారు. రుద్రయాగ కమిటీ, అధిక సంఖ్యలో భక్తులు రాట ముహూర్తంలో పాల్గొన్నారు.

హౌస్ అరెస్టులు అమానుషం

కాజులూరు: మండల గ్రామాల నుంచి శాంతియుతంగా కాకినాడ ట్రాక్టర్ల ర్యాలీకి వెళుతున్న పలువురు కౌలురైతు సంఘం నాయకులను పోలీసులు హౌస్ అరెస్టులు చేయడం అమానుషమైన చర్య అని ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లు రాజబాబు అన్నారు. ట్రాక్టర్ల ర్యాలీకి వెళుతున్న జిల్లా కౌలురైతు సంఘం నాయకుడు, పెనుమళ్ళ మాజీ సర్పంచ్ వనుం వీరబ్రహ్మం, మండల కౌలురైతు సంఘం అధ్యక్షుడు కురుపూడి భూచక్రం తదితరులకు గురువారం గొల్లపాలెం పోలీసులు నోటీసులు జారీచేసి హౌస్ అరెస్టులు చేశారు. దీనిపై రాజబాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన రైతు వ్యతిరేక చట్టాలను ప్రతిఘటిస్తూ ఢిల్లీ కేంద్రంగా ఏడాది పాటు ఆందోళనలు చేయటంతో కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి వాటిని రద్దు చేస్తామని, పంటకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు ఎరువులు, పురుగుమందుల ధరలు అందుబాటులోనికి తీసుకువస్తామని హామీ ఇచ్చిందన్నారు. రైతులు దీక్ష విరమింపజేసి ఏడాది గడుస్తున్నా కేంద్రం హామీలు అమలు చేయకపోవటంతో దేశవ్యాప్తంగా ట్రాక్టర్ల ర్యాలీతో నిరసన తెలుపేందుకు ఆల్ ఇండియా రైతు సంఘాల సమాఖ్య పిలుపునిచ్చిందన్నారు. అయితే కార్యక్రమాలకు వెళ్లకుండా పోలీసులు కౌలురైతు సంఘం నాయకులను అరెస్టులు చేసిందన్నారు.